

# అప్పర్ క్లాస్ శోభనం

—ప్రసాదవర్మ

## 10-30-20 సెకండ్లు

ఇద్దర్నీ గది లోకి పంపించారు. అతను ఇంజనీరు, ఆమె డాక్టరు. అయినా శోభనం శాస్త్రోక్తంగా జరిగింది.

అతను కూర్చున్నాడు మంచం మీద. ఆమె పాలగ్లాసుతో రాలేదు. మామూలుగానే వచ్చింది.

"హలో!" అన్నాడు.

"హలో!" అని నవ్వింది.

బాగా నవ్విందనుకొన్నాడు. అతనూ నవ్వాడు. స్మైల్ రాలేదు. పర్వాలేదు. రోజూ నవ్వు తోము కుంటాడనుకొంది డాక్టర్ వధువు.

ప్రక్కనే కూర్చుంది.

"నీ ప్రాక్టీసు బావుంటుందా?" అని అడిగేడు.

"పర్వాలేదు. రోజుకు రెండు కాన్పులు, నాలుగు అబార్షన్స్ చేస్తున్నాను" అంది ఆమె.

దాన్ని బట్టి ఆమె రోజువారీ ఇన్‌కం లెక్కవేశాడు.

## 10-35-01 సెకండ్లు

కాస్సేపు మౌనం.

"నీవు చాలా బావుంటావ్!"

"అందుకనేగా నాలుగు లక్షలు తీసుకొని పెళ్లి చేసుకున్నావ్" అంది డాక్టర్.

ఇంజనీరు తెల్లబోయాడు.

ఈ సందర్భంగా నాల్గు లక్షలుమాట వస్తుందను కోలేదు. అదీగాక తనని ఏకవచనంలో సంబోధిస్తున్నది.

కాస్సేపు తేరుకోలేకపోయాడు. నవ్వేడు. వెకిలినవ్వు.

ఆ నవ్వు నచ్చలేదు. అసహ్యంగా ఉన్నదనుకొంది. చక్కగా నవ్వలేడనుకొంది.

## 10-40-15 సెకండ్లు

"మీ మెడికోలందరూ ఫ్రీగా వుంటారు గదా!" అన్నాడు ఇంజనీరు.

"అవును! మా వృత్తే అది కదా!" అంది డాక్టరు.

"అవునూ! మీరు మెకానికల్ కదా! జీతమెంత?" అడగింది.

చెప్పాడు, ఆలోచించి.

"అంత ఆలోచనెందుకు జీతం చెప్పడానికి?" అడిగింది.

"జీతమేనా- గీతం కూడా కలపాలా అని ఆలోచిం చాను" అన్నాడు సిన్సియర్‌గా.

"గీతమెంత వస్తుంది" మళ్ళీ అడిగింది.

చెప్పేడు గీతం కూడా.

"పర్వాలేదు.." అంది.

"ఏం పర్వాలేదు?"

"మీరు నాల్గు లక్షల ఖరీదు చేస్తారు!" అంది తృప్తిగా.

మళ్ళీ వెకిలిగా నవ్వి భుజంమీద చేతులు వేశాడు.

"ఉండండి..." అంది. అని లేచింది.

తెల్లబోయాడు మళ్ళీ ఎందుకు లేచిందో అర్థం కాక.

## 10-45-30 సెకండ్లు

ఆమె లేచి, చీర విప్పేసింది. జాకెట్టు విప్పేసింది. మూల బీరువా దగ్గరకు నడచి నైట్ గౌన్ వేసుకొంది.

వచ్చి అతని ప్రక్క కూర్చుంది. "ఇక చెప్పండి" అంది.

ఏం చెప్పాలో అర్థం కాలేదు. దగ్గరకు తీసుకున్నాడు. చెంపలపైన ముద్దు పెట్టుకున్నాడు. ఆమె అతను చేసే పనులు గమనిస్తూంది.

"నైటీ ఎందుకు?" అడిగాడు.

"కంఫర్టుగా వుంటుందని" అన్నది.

"దేనికి" అన్నాడు. చిలిపిగా అడిగాననుకొన్నాడు.

"నువు దేనికనుకొంటే దానికి" అంది.

"నువు చాలా తెలివైనదానివి" అన్నాడు.

"నీ కన్నానా! మీ నాన్న కన్నానా!" అంది.

మళ్ళీ నొచ్చుకుపోయాడు. నాన్న ఈ గదిలోకి ఎందుకొచ్చాడా అని.

## 10-50-02 సెకండ్లు

అసలు కార్యక్రమానికి వచ్చేద్దామని- గట్టిగా కౌగ లించుకున్నాడు ఇంజనీరు.

అతని కౌగిలిలో ఇమిడింది డాక్టరు అయిష్టంగా.

అతను మొగవాడు చేయాల్సిన పనులు చేస్తున్నాడు. ఆడది భరించాల్సిన పనులు ఆమె భరిస్తున్నది.

## 10-60-00 అనగా 11-00-00

అతను అటు తిరిగి పడుకొన్నాడు వెయ్యి ఆలో చనలతో అసంతృప్తిగా. ఆమె లేచి బాత్‌రూంకు వెళ్ళింది.

## 11-10-01

ఆమె స్నానం చేసి వచ్చింది. తను చదువుకునే టేబుల్ దగ్గరకు పోయి రేపు చేయబోయే ఆపరేషన్ గురించి పుస్తకాలు తిరగవేస్తున్నది.

## 11-50-20

ఆమెకూ నిద్ర వచ్చి- అతని ప్రక్క పడుకొంది- అతన్ని అనుకోకుండా.

## 12-00-00

ఇద్దరూ సుఖనిద్రలోకి జారారు. ఖచ్చితంగా అది అర్థరాత్రి.